క్లుప్తంగా

నేత్రపర్వం.. శ్రీకృష్ణ గ్రామోత్సవం



బత్తలపల్లిలో శ్రీకృష్ణుని ప్రతిమను ఊరేగిస్తున్న గ్రామస్తులు

బత్తలపల్లి: మండలం కేంద్రంలోని బత్తలపల్లిలో ఈడిగ నాగేంద్ర ఇంటి వద్ద ఏర్పాటు చేసిన, మాల్యవంతం గ్రామంలో గత రెండు రోజులుగా పూజలు అందుకున్న శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాలను మంగళవారం గ్రామోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. కృష్ణాష్టమిని పురస్కరించుకుని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. మంగళవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకృష్ణుని జన్మవృత్తాంతాన్ని భక్తులకు వివరించారు. అనంతరం శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. కోలాటం, భజనలతో ఊరేగింపు కొనసాగింది. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలి



మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ వెంకటనారాయణ

తనకల్లు: ప్రతి అధికారి యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని నోడల్ ఆఫీసర్ వెంకటనారాయణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం 'వికసిత్ ఆంధ్రప్రదేశ్' కార్యక్రమంలో భాగంగా మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. నోడల్ ఆఫీసర్ మాట్లాడుతూ విద్య, వైద్యం, వ్యవసాయంతో పాటు అన్ని శాఖల అధికారులు వికసిత్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ఐదేళ్లకు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని తెలిపారు. ప్రతి రంగంగలోనూ 15 శాతం వృద్ధి సాధించేలా ప్రణాళికలు రూపొందిచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటరమణ, ఏఓ శ్రీహరినాయక్, ఎంఈఓ లలితమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, జయమ్మ, ఏపీఎం వెంకటనారాయణ, హౌసింగ్ ఏఈ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు తెలుగు భాషా సంబరాలు

బత్తలపల్లి: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గురువారం ధర్మవరంలోని భారతి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో తెలుగు భాషా సంబరాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం బత్తలపల్లిలో మీడియాతో మాట్లాడారు. శ్రీకళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తి మండ ప్రతాప్, యువజన విభాగం జాతీయ అధ్యక్షులు వడ్డి సుధాకర్ ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లా యువజన కమిటీల తరపున పిల్లల్లో తెలుగుపై ఆసక్తి పెంచేలా, తెలుగు సంస్కృతికి అద్దం పట్టేలా 'తెలుగు భాషా సంబరాలు' నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి యువజన కమిటీ సభ్యులు, కవులు, విద్యార్థులు పలువురు హాజరవుతారన్నారు.

ఘనంగా సీతారాముల ఆరాధన



కుర్లపల్లిలో సంకీర్తనారాధన నిర్వహిస్తున్న దృశ్యం

కనగానపల్లి: కుర్లపల్లి గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సీతారాముల సంకీర్తనారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రావణ పౌర్ణమి మాసోత్సవాల్లో భాగంగా స్థానిక రామాలయంలో టీటీడీ వారు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం ఎం. చెర్లోపల్లి, చంద్రాచర్ల భజన బృందాలు శ్రీ సీతారాముల సంకీర్తనారాధన, భజన కార్యక్రమాలను నిర్వహించాయి. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఈశ్వరమ్మ, టీటీడీ ప్రచార కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రణాళికల తయారీపై వర్క్‌షాప్

పుట్టపర్తి: బుక్కపట్నం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం 'వికసిత్ ఆంధ్రప్రదేశ్- 2047'పై సమావేశం నిర్వహించారు. 2024-29 వరకు ప్రణాళికల తయారీపై వర్క్‌షాపు నిర్వహించారు. జిల్లా పరిశ్రమల అధికారి, మండల నోడల్ అధికారి సయ్యద్‌బాషా, ఎంపీడీఓతో పాటుగా మండల స్థాయి అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



మహిళా వైద్యులకు రక్షణ అవసరం

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులకు రక్షణ లేకుండా పోతోంది. కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనలో దోషులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్ష విధించాలి. ప్రభుత్వ ఆస్పత్రి పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది భద్రత కోసం ఇద్దరు పోలీసులతో బందోబస్తు నిర్వహించేలా చర్యలు చేపట్టాలి.

– పుష్పలత, వైద్యాధికారిణి, దర్శనమల,





ప్రభుత్వాలు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

సమాజం బాగు కోసం అందరూ కలిసి ముందుకు రావాలి. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటన ఘోరమైనది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు పకడ్బందీ చర్యలు చేపట్టాలి. కోల్‌కతా ఉదంతం పెద్ద స్కాం. ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తుండటంతోనే ఇలాంటి ఘోరాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం వాస్తవ పరిస్థితిని అధ్యయనం చేసి వైద్యులు, సిబ్బందికి అన్ని రకాల వసతులు, రక్షణ కల్పించేలా చట్టం చేయాలి.

– డాక్టర్ తేజశ్రీ, వైద్యాధికారిణి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బత్తలపల్లి

అలా చదివితే.. ఇలా కొలువు

- ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సుకు ఆదరణ
- కోర్సు పూర్తవగానే ఆస్పత్రుల్లో ఉపాధి

కదిరి అర్బన్: గ్రామీణ ప్రాంత బాలికలు సత్వర ఉపాధి–సంపాదన కోసం పదో తరగతి పూర్తవగానే ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఫిమేల్) కోర్సును ఎంచుకుంటున్నారు. ఆస్పత్రుల్లో కొలువులు పొంది కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. కదిరిలోని బాలికల జూనియర్ కళాశాలలో మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ – ఫిమేల్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ–ఎఫ్) కోర్సుకు ప్రతి ఏటా డిమాండ్ పెరుగుతోంది. రెండేళ్ల కాల పరిమితి గల ఈ కోర్సులో 30 సీట్లు ఉన్నాయి. ప్రథమ సంవత్సరంలో ఇంగ్లిష్, జనరల్ ఫౌండేషన్ కోర్సు, కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్, హెల్త్ ప్రమోషన్, ప్రైమరీ హెల్త్‌కోర్స్ నర్సింగ్ సబ్జెక్టులు ఉంటాయి.

ద్వితీయ సంవత్సరంలో ఇంగ్లిష్, చైల్డ్ హెల్త్ నర్సింగ్, జీఎఫ్‌సీ మిడ్‌వైఫరీ, హెల్త్ సెంటర్ మేనేజ్‌మెంట్ సబ్జెక్టులతో పాటు బ్రిడ్జి కోర్సు (ఫిజిక్స్, బాటనీ, జువాలజీ, కెమిస్ట్రీ) ఉంటాయి. డివిజన్ పరిధిలోని పది మండలాల నుంచి టెన్త్ పూర్తయిన బాలికలు ఈ కోర్సులో చేరుతున్నారు. కోర్సు పూర్తి కాగానే వెంటనే ఏదో ఒక నర్సింగ్ హోమ్‌లో ఉపాధి దొరుకుతుందని వారు చేరుతున్నారు. సంప్రదాయ కోర్సులు చదివితే ఉద్యోగాలు వస్తాయన్న గ్యారెంటీ లేదని.. ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఫిమేల్) కోర్సు చేస్తే త్వరితగతిన ఉపాధి లభిస్తోందని విద్యార్థినులు చెబుతున్నారు. రోగులకు సేవ చేయడం కూడా సామాజిక సేవలో భాగమేనని అంటున్నారు.



ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు చదువుతున్న విద్యార్థులు

కోర్సు అయిపోగానే ఉద్యోగం



కోర్సు పూర్తవగానే ప్రైవేట్ నర్సింగ్ హోంలో ఉపాధి దొరుకుతుంది. సంప్రదాయ కోర్సులు చదివితే ఇప్పుడున్న పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు సాధించడం కష్టం. అదే ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఫిమేల్) కోర్సు పూర్తి చేయగలిగితే ఉద్యోగంలో వెంటనే చేరి కుటుంబానికి ఎంతో కొంత మనం అండగా నిలవచ్చు.

– ఎస్.ముస్కాన్, కదిరి

ఆస్పత్రుల సంఖ్య పెరుగుతోంది



ఎక్కడ చూసినా ఆస్పత్రులు పెరిగిపోతున్నాయి. ఇందులో ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు చేరిన వారికి ప్రాధాన్యత ఉంటుంది. ఉపాధి లేదనే భయం ఉండదు. ఏదో ఒక నర్సింగ్‌హోంలో చేరొచ్చు. అంతే కాకుండా ఈ కోర్సు పూర్తయిన వెంటనే బీఎస్సీ నర్సింగ్‌లోనూ చేరవచ్చు.

– వి.గౌతమి, కటారుపల్లి, గాండ్లపెంట మండలం

స్థానికంగానే ఉద్యోగావకాశం



ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు పూర్తి చేస్తే స్థానికంగానే ఉద్యోగావకాశం లభిస్తుంది. కదిరి పట్టణంతో పాటు పరిసర మండలాల్లో ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరొచ్చు. కుటుంబానికి దగ్గరగా ఉంటూనే ఉద్యోగం చేసుకోవచ్చు.

– ఎస్ షబానా, ఇనగలూరు, ఓడీసీ మండలం

కోర్సుకు ఆదరణ పెరిగింది



ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఫిమేల్) కోర్సులో చేరడానికి చాలా మంది విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఇందులో బ్రిడ్జి కోర్సు కూడా ఉంటుంది. ఇది పూర్తి చేస్తే ఎంసెట్ కూడా రాయొచ్చు. ఇక్కడ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు కదిరి, బెంగళూరు, అనంతపురం ఆర్డీటీ, ఆస్పత్రుల్లో పని చేస్తున్నారు.

– వెంకటేశ్వర ప్రసాద్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల కదిరి:

ఆశాలతో వెట్టిచాకిరీ తగదు



ఆశా వర్కర్‌తో ఆస్పత్రిని శుభ్రం చేయిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: పట్నం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశావర్కర్లతో వెట్టిచాకిరీ చేయించడం అధికారులకు తగదని సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షులు సాంబశివ ధ్వజమెత్తారు. ఢిల్లీ నుంచి అధికారుల బృందం రాక సందర్భంగా పట్నం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం గోడలకు రంగులు వేయించడం, మరుగుదొడ్లు శుభ్రం చేయించడం, చెత్త, పిచ్చి మొక్కల తొలగింపు వంటి పనులను ఆశాకార్యకర్తలతో చేయిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆస్పత్రుల నిర్వహణ కోసం నిధులు మంజూరు చేస్తున్నా ఆశా వర్కర్లతో వెట్టిచాకిరీ చేయించుకుని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ దొంగ బిల్లులు చేసుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


ధర్మవరం కళాకారుల ప్రతిభ



ధర్మవరం నాట్య కళాకారుల ప్రదర్శన

ధర్మవరం అర్బన్: మైసూరు దత్తపీఠం శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ ఆశ్రమంలో కృష్ణాష్టమి సందర్భంగా మంగళవారం ధర్మవరంలోని శ్రీ లలిత నాట్య కళానికేతన్ గురువులు బాబు బాలాజీ, కమల బాలాజీ, రామలాలిత్యలు 25మంది శిష్య బృందంతో చేసిన నాట్యం అందరినీ ఆకట్టుకుంది. 'కృష్ణం వందే జగద్గురుం' అనే కూచిపూడి నృత్య నాటికను ప్రదర్శించారు. బాలస్వామి, శ్రీ విజయానంద తీర్థ స్వామిజీ చేతులమీదుగా జ్ఞాపికలు, సన్మానం పొందారు.

మీడియా కమిటీ సభ్యుడిగా విజయ్‌కుమార్



విజయ్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: అనంతపురం వేదికగా జరగనున్న దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌కు ప్రెస్ అండ్ పబ్లిసిటీ మీడియా కమిటీ సభ్యునిగా కొత్తచెరువుకు చెందిన విజయ్‌కుమార్‌ను ఎంపిక చేశారు. సెప్టెంబర్ 5 నుంచి 22 వరకు జరగనున్న క్రీడల్లో భాగంగా ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ మధు ఆచారి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌ఓ రామచంద్రారెడ్డి

నల్లచెరువు: మండల కేంద్రంలోని మండల పరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం సీజనల్ వ్యాధులపై సీహెచ్‌ఓ రామచంద్రారెడ్డి అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఆహారం తినే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. దోమకాటుకు గురి కాకుండా సాయంత్ర వేపాకుపొగ వేసుకోవాలని, దోమ తెరలు తప్పక ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, ఆశా కార్యకర్త ఖాదర్‌బీ, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

యూపీఎస్‌తో ఒనగూరేదేమీ లేదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకులు హరిప్రసాద్‌రెడ్డి

ఎన్పీకుంట: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూపీఎస్ (యూనిఫైడ్ పెన్షన్ స్కీం) వల్ల ఉపాధ్యాయులకు ఒనగూరేదేమీ లేదని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి ధ్వజమెత్తారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీపీఎస్ స్థానంలో జీపీఎస్ అమలుకు గెజిట్ విడుదల చేసిన నేపథ్యంలో ఉపాధ్యాయుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో గత ప్రభుత్వం జీపీఎస్ గెజిట్‌ను నిలుపుదల చేసిందని గుర్తుచేశారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న యూపీఎస్‌కీ, జీపీఎస్‌కీ తేడా ఏమీ లేదని అన్నారు. సుదీర్ఘ కాలం పాటు ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉంటూ ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకాన్ని, కార్యక్రమాన్ని ప్రజల వద్దకు చేర్చే ఉద్యోగి పదవీ విరమణ అనంతరం అవసాన దశలో ఆసరాగా, భవిష్యత్తుకు భరోసాగా గౌరవప్రదంగా జీవించడానికి పింఛన్ ఇవ్వడం ప్రభుత్వాలు బాధ్యతగా భావించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు రామాంజనేయులు, కౌన్సిలర్ రమణానాయక్, మురళి, శివయ్య, షరీఫ్, రహీం, రామ్మోహన్, లాలూసాబ్, వెంకటరామిరెడ్డి, రమణయ్య, ముషీర్ అహ్మద్, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గొడవలు, అల్లర్ల జోలికి వెళ్లొద్దు



పెద్ద కొట్టాల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

బత్తలపల్లి: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించి, గొడవలు, అల్లర్ల జోలికి వెళ్లి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. ఎస్పీ రత్న ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని ఈదుల ముష్టూరు, పెద్ద కొట్టాల (బీసీ కాలనీ) గ్రామాల్లో ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్ఐ శ్రీనివాసులుతో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో డీఎస్పీ మాట్లాడుతూ పాత కక్షలు మనసులో ఉంచుకుని గొడవలు, బెదిరింపులకు దిగరాదన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేవిధంగా చూసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. రౌడీషీటర్లకు, గత కేసుల్లో నిందితులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అక్రమంగా మద్యం విక్రయించేవారి నివాసాలు, అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లల్లో తనిఖీలు చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు తిరుపాలు, సోమశేఖర్‌మూర్తి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాధాకృష్ణుల సందడి



ఓడీచెరువులో కృష్ణాష్టమి సందర్భంగా చిన్నారుల కోలాట ప్రదర్శన

ధర్మవరం అర్బన్/ ఓడీ చెరువు: శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఉత్సాహంగా సాగుతున్నాయి. రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు సందడి చేశారు. ధర్మవరం పట్టణంలోని బ్రాహ్మణవీధిలోనున్న శ్రీ వెన్నముద్దల వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు మంగళవారం ముగిశాయి. ఉత్సవ విగ్రహానికి అర్చకులు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. యాదవ వీధిలోనున్న శ్రీజయకృష్ణస్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఆలయ అధ్యక్షుడు డాక్టర్ వివేక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీకృష్ణుని విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో అన్నమయ్య సేవా మండలి సభ్యులు చిన్న కృష్ణుల చేత ఉట్టి కొట్టించారు.

- ఓడీ చెరువు మండల కేంద్రంలో ప్రైవేట్ విద్యా సంస్థలో మంగళవారం శ్రీకృష్ణుని జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో విద్యార్థులు అలరించారు. శ్రీకృష్ణుని భక్తి గీతాలు, నృత్య, నాటక ప్రదర్శనలు, ఉట్టి కొట్టడం లాంటి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రెండోరోజూ కృష్ణాష్టమి వేడుకలు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు మంగళవారం రెండో రోజూ కొనసాగాయి. ఈసందర్భంగా అర్చకులు శ్రీ కృష్ణ పరమాత్మ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



ధర్మవరంలో ఉట్టి కొడుతున్న చిన్న కృష్ణులు



చెన్నేకొత్తపల్లిలో పూజల్లో పాల్గొన్న భక్తులు

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం రూరల్: గొట్లూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శివారెడ్డి (70) గుండెపోటుతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గొట్లూరుకు వెళ్లి శివారెడ్డి మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం రూరల్: రావులచెరువు గ్రామానికి చెందిన ఆదెప్ప అనే యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాలిలా ఉన్నాయి. తల్లిదండ్రులు తనకు పెళ్లి చేయలేదని మనస్తాపం చెందిన ఆదెప్ప మంగళవారం గొర్రెల్లో పిడదల నివారణకు వాడే మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి ధర్మవరం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స చేయించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

'ఉపాధి' పనుల్లో అక్రమాలు

అమడగూరు: ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీలో వెలుగుచూసింది. మండలంలో గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు ఉపాధి హామీ పథకం కింద 921 పనులు చేపట్టారు. ఈ పనులపై ఇటీవల సామాజిక తనిఖీలు నిర్వహించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. మొత్తం రూ 9.76 కోట్ల నిధులతో చేపట్టిన పనుల్లో రూ.48,676 మేర అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీలో గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో రూ.22,518 రికవరీ చేయగా.. మిగిలిన రూ 26,158 రికవరీ చేయాల్సి ఉందని చెప్పారు. కార్యక్రమంలో పీడీ విజయేంద్రప్రసాద్, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, ఏపీఓ రాజ్‌కుమార్, ఏపీడీ శ్రీనివాసరెడ్డి, ఎస్ఆర్‌పీ చంద్రమోహన్, పీఆర్ ఏఈఈ గుప్తా, హౌసింగ్ ఏఈ సుదర్శన్, ఏపీఓ అమరావతి, ఈసీ ఆనంద్, జెడ్పీటీసీ భర్త శివశంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళకు గాయాలు



చికిత్స పొందుతున్న లక్ష్మీత్రివేణి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని బోయవీధికి చెందిన లక్ష్మీత్రివేణి మంగళవారం సాయంత్రం ఇంట్లో పూజ చేస్తుండగా ప్రమాదవశాత్తు దీపం ఆమె వేసుకున్న నైటీకి అంటుకుంది. ఈ ప్రమాదంలో ఆమె శరీరంలో వెనుకవైపు మంటలు వ్యాపించడంతో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే మంటలను ఆర్పివేసి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన అనంతరం ఆమెను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి పంపించారు.

గుజిరీ షాపులో చోరీ

గాండ్లపెంట: మండల కేంద్రంలోని గుజిరీ షాపులో సోమవారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. కదిరి – రాయచోటి ప్రధాన రహదారి పక్కన ఉన్న మహమ్మద్‌రఫీ అనే వ్యక్తి గుజిరీషాపు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి దుండగులు షాపులోని సీసీ కెమెరాలను ధ్వంసం చేసి వెనుక వైపు రేకులు తొలగించి లోనికి ప్రవేశించారు. షాపులో ఉన్న కేబుల్, సిల్వర్ సామాన్లు, విద్యుత్ మోటారు వస్తువులను ఎత్తుకెళ్లారు. దాదాపు రూ.18వేలు విలువ గల గుజిరీ వస్తువులు చోరీ అయినట్లు బాధితుడు తెలిపాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణవేణి చెప్పారు.

- ఇదిలా ఉండగా... ఇదే రోడ్డులోని నాగకుమారి టీస్టాల్‌లోనూ చోరీ జరిగింది. షట్టరు తొలగించి మూడు గ్యాస్ సిలిండర్లతో పాటు బీడీ, సిగరెట్ బండిళ్లు, కూల్‌డ్రింక్ బాటిళ్లు ఎత్తుకెళ్లారని బాధితురాలు తెలిపింది.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం

పుట్టపర్తి టౌన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు వేమయ్య యాదవ్ ధ్వజమెత్తారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమయ్య యాదవ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న బుక్కపట్నం డిగ్రీ కళాశాల భవన నిర్మాణం ఏళ్ల తరబడి కొనసాగుతూనే ఉందన్నారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని, బోధన ప్రమాణాలు మెరుగు పరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నల్లజోడు పవన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు అంజనేయులు, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు మహేంద్ర, దేవా, పవన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ధర్మవరం డివిజన్
9912220717, 9912220727,
9912220726, 9010593486